క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని లక్క వరం గ్రామంలో షేక్ అబ్దుల్ రహీం కుమారుడు ఇటీవల బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. గురువారం రహీంను అతని చిన్ననాటి స్నేహితులు పరామర్శించి ఓదార్చారు. రూ.10 వేలు ఆర్థిసాయం అందజేశారు. కార్యక్రమంలో చామకూరి నర్సింహారావు, ఉపేందర్, నాగరాజు, గురవయ్య, బాబు, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని వినతి

నడిగూడెం : గ్రామీణ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం నడిగూడెంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డికి మండలానికి చెందిన గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యుల వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి సైదులు, దున్నా వీరబాబు, తన్నీరు సత్యనారాయణ, గురుస్వామి, వీరబోయిన సైదులు, కామళ్ల ప్రభాకర్, అర్జున్ ఉన్నారు.

వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి



వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం, తదితరులు

హుజూర్‌నగర్‌రూరల్ : వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెనుగొండ శ్రీనివాస్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్ మండల పరిధిలోని లింగగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీనియర్ వ్యాయమ ఉపాధ్యాయుడు బ్రహ్మారెడ్డి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని హెచ్‌ఎం ప్రారంభించి మాట్లాడారు. ఆటలు ఆరోగ్యానికి ఆనంద సోపానాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ శ్రీదేవి, రవి, పీఈటీ ప్రదీప్, ఉపాధ్యాయులు నాగసైదులు, వాలీబాల్ క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం

మఠంపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా యువజన సర్వీసులు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి వేసవి వాలీబాల్ క్రీడా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల పీఈటీ మన్నెం సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. 14 సంవత్సరాలలోపు బాలబాలికలకు ప్రతి నిత్యం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7వరకు మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యసిబ్బందికి అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మఠంపల్లి : వేసవి తాపం నుంచి బయట పడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారులు అన్నారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీ సెంటర్‌లో వైద్య సిబ్బందికి, ఆశా వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఎవరైనా వడదెబ్బకు గురైతే చేయాల్సిన ప్రథమ చికిత్స గురించి వివరించారు. పీహెచ్‌సీ డాక్టర్ సుధాకర్, సూపర్‌వైజర్ రవికుమార్, నాగేంద్రమ్మ, లక్ష్మణ్, చంద్రకళ, పద్మ, నిర్మల, ప్రియాంక, రజని, సైదమ్మ, రాణి, లోకేశ్వరి, సరిత, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని పలువురికి గాయాలు

నడిగూడెం : ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని పలువురికి గాయాలైన సంఘటన గురువారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం గ్రామానికి చెందిన గంటిపంగు దానియేలు తన కుమారుడు ఆనంద్‌బాబుతో కోదాడ నుంచి నడిగూడెంకు వస్తున్నాడు. అదే విధంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం ఈశ్వరమాధారం గ్రామానికి చెందిన ఎం.వీరబాబు తన ద్విచక్రవాహనంపై సైదమ్మ, మంగమ్మతో నడిగూడెం నుంచి బరాఖత్‌గూడెం రహదారిలో ఉన్న పెట్రోలు బంకులోకి వెళ్తుండగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో దానియేలు, ఆనంద్‌బాబు, వీరబాబు, సైదమ్మలకు గాయాలవ్వడంతో నడిగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసిన అనంతరం 108లో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అధ్వానంగా లింకు రోడ్లు

- అడుగడుగునా గుంతలు
- రహదారులను ఇరువైపులా కమ్మేసిన కంపచెట్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- బీటీగా మార్చాలని వేడుకోలు



గుంతలమయంగా కాల్వపల్లితండా నుంచి అల్లీపురం వెళ్లే రోడ్డు



జామ్లాతండా నుంచి నిమ్మతండా వెళ్లే రోడ్డును కమ్మేసిన కంపచెట్లు

మఠంపల్లి : మండలంలో వివిధ గ్రామాలను కలిపే రోడ్లు అధ్వానంగా మారాయి. రహదారులు శిథిలావస్థకు చేరి గుంతలమయంగా మారాయి. అంతేకాకుండా రోడ్లను ఇరువైపులా కంపచెట్లు కమ్మేశాయి. దీంతో ప్రయాణానికి తీవ్ర ఆటంకంగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారుల్లో ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నామని చెబుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణం ప్రాణ సంకటంగా మారిందని అంటున్నారు.

రోడ్ల దుస్థితి ఇదీ..

ముఖ్యంగా మఠంపల్లి మండల కేంద్రం నుంచి కాల్వపల్లితండా మీదుగా అల్లీపురం వరకు గల ఒకటిన్నర కిలోమీటరు రోడ్డు గుంతలమయమైంది. ఇరుపక్కల దట్టంగా కంపచెట్లు పెరిగాయి. అదేవిధంగా వరదాపురం నుంచి బాదావత్‌తండా మీదుగా కామంచికుంటతండా వరకు గల సుమారు మూడున్నర కిలోమీటర్లు రోడ్డు పరిస్థితి అలానే ఉంది. నిమ్మతండా నుంచి జామ్లాతండా వరకు రెండు కిలోమీటర్లు గల రోడ్డు, మఠంపల్లి రోడ్డు నుంచి ఒక కిలోమీటరు దూరం ఉన్న అవిరేణికుంటతండా రోడ్డు, బురకలతండా నుంచి 2 కిలోమీటర్ల దూరం ఉన్న పెదవీడు రోడ్డు అధ్వానంగా తయారైంది. అంతేగాక లాలితండా నుంచి పెదవీడు వరకు సుమారు 3 కిలోమీటర్ల దూరం గల రోడ్డు పరిస్థితి దారుణంగానే ఉంది. ఆయా రోడ్లు అనేక ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. రోడ్లను ప్రభుత్వం బీటీలుగా మార్చడం లేదు. దీంతో ప్రజలకు అవస్థలు పడుతున్నారు. కావున అధ్వానంగా మారిన రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, పలు రోడ్లను బీటీలుగా మార్చాలని, రోడ్లకు ఇరువైపులా దట్టంగా పెరిగిన కంపచెట్లను తొలగించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

కంపచెట్లు తొలగించాలి



మఠంపల్లి నుంచి కొత్త తండా, జామ్లాతండాల మీదుగా నిమ్మతండా వెళ్లే రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు దట్టంగా పెరిగి దారిని కమ్మేశాయి. దీంతో రాత్రి సమయాల్లో ఆ రహదారుల్లో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలి.

– ధరావత్ బాలకృష్ణానాయక్, నిమ్మతండా

ప్రభుత్వం దృష్టి సారించాలి



మండల కేంద్రం నుంచి గ్రామాలు, గిరిజన తండాలకు వెళ్లే రోడ్లు కంకర తేలి గుంతలమయం అయ్యాయి. కావున వర్షాకాలం రాకముందే అధికారులు రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించాలి. పలు రోడ్లను బీటీగా మార్చాలి. రోడ్లకు ఇరుపక్కల కంపచెట్లు తొలగించాలి.

– బానోతు జగన్‌నాయక్, జెడ్పీటీసీ, మఠంపల్లి

ఆటోలు కూడా రావడం లేదు



మండలంలో లింకు రోడ్లు అధ్వానంగా మారాయి. దారులను ఇరుపక్కల కంపచెట్లు కమ్మేశాయి. దీంతో రోడ్లు బాగా లేవని సాకుతో ఆటోలు కూడా సక్రమంగా నడవడం లేదు. దీంతో ప్రయాణానికి ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి రోడ్లు బాగు చేయించాలి.

– బాలునాయక్, లాలితండా

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో లయన్స్ క్లబ్ సభ్యులు, తదితరులు

నేరేడుచర్ల : పదవ తరగతి ఫలితాల్లో నేరేడుచర్ల మండలంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్, దాతల ఆధ్వర్యంలో ప్రోత్సాహకాలు అందజేశారు. మండల కేంద్రంతో పాటు పెంచికల్ దిన్న, సోమారం, దాసారం, మేడారం, దిర్శించర్ల, చింతకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన 14 మంది విద్యార్థులకు ప్రతిభ ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ చైర్మన్ బట్టు మధు, సభ్యులు రాచకొండ శ్రీనివాస్‌రావు, సూర్యనారాయణరెడ్డి, సత్యనారాయణ, రామస్వామి, క్రాంతికుమార్, శ్రీనివాస్‌రావు, సైదులు, యూసుఫ్, విశ్వనాథ్, రాఘవరెడ్డి, రషీద్‌ఖాన్, శ్రీనివాస్‌రావు, బాలు, హెచ్‌ఎం బాలు, దాతలు కొనతం సత్యనారాయణరెడ్డి, యడవల్లి కృష్ణయ్య, రాచకొండ శ్రీనివాస్‌రావు, బట్టు మధు, యడవల్లి జానయ్య, కుక్కడపు సైదులు, సైదులునాయక్, కొండ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎన్నికల ప్రచార ర్యాలీని జయప్రదం చేయాలి

చిలుకూరు : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో చిలుకూరు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించబోయే కాంగ్రెస్ పార్టీ మండల సమావేశం, ప్రచార ర్యాలీలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కీత వెంకటేశ్వర్లు, పింగ్రాతి హనుమంతరావు కోరారు. గురువారం చిలుకూరులో వారు విలేకరులతో మాట్లాడారు. ఉదయం 8 గంటలకే ప్రచార ర్యాలీ ప్రారంభం అవుతుందని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించాలి

గరిడేపల్లి : అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం తక్షణమే వేసవి సెలవులు ప్రకటించాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నడూ లేనివిధంగా ఎండలు నిప్పుల కొలిమిలా ఉంటే 3– 5 సంవత్సరాల పిల్లలతో అంగన్‌వాడీ పాఠశాలలు నిర్వహించడం సరైంది కాదన్నారు. ప్రీ స్కూల్ పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఈ నెలకు సరిపోయే టీహెచ్‌ఆర్ (టేక్ హోం రేషన్) ను ఇంటికే ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు త్రిపురం సుధాకర్ రెడ్డి, మండల కార్యవర్గ సభ్యుడు యడ్ల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి



చిలుకూరు : బీజేపీ మండల కోఆర్డినేటర్లతో మాట్లాడుతున్న మండల ఇన్‌చార్జ్ రమేష్

చిలుకూరు : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేసి బీజేపీ గెలుపునకు పార్టీ నాయకులు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు, చిలుకూరు మండల ఇన్‌చార్జి యాదా రమేష్ సూచించారు. గురువారం చిలుకూరులో బీజేపీ మండల కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి సైదిరెడ్డి గెలుపునకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పని చేయాలని సూచించారు. మోదీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు అజ్మీర మనోజ్ నాయక్, వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ఓటర్లకు వివరించాలి

కోదాడరూరల్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను ఓటర్లకు వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని బీజేపీ ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ కొండ్లె రవికుమార్ అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని పలు బూత్‌లలో పార్టీ కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీ 400 ఎంపీ సీట్లు గెలుస్తుందని, అందులో నల్లగొండ కూడా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాస్, కొండపల్లి నాగమణి, పంది వెంకటరమణ, కొదుముల కళావతి, హితీష్, నవీన్‌కుమార్, అజయ్‌యాదవ్, శ్రీహరి, గోదేశి లక్ష్మణ్, సత్యనారాయణ ఉన్నారు.

గాయం కిచ్చారెడ్డి వర్ధంతి



కిచ్చారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, గ్రామస్తులు

మఠంపల్లి : మండలంలోని పెదవీడుకు చెందిన మాజీ సర్పంచ్, సింగిల్ విండో మాజీ చైర్మన్ గాయం కిచ్చారెడ్డి 14వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కిచ్చారెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కరీమ్, గురువయ్య, సోములుగౌడ్, వెంకటేశ్వరెడ్డి, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, గాయం ఆదిరెడ్డి, వెంకటి, కోటిరెడ్డి, సైదాహుస్సేన్ మట్టయ్య, సైదులు, శ్రీను, సుధాకర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాలొగన్నారు.

మిషన్ భగీరథ నీరు వృథా



చెన్నాయిపాలెం వద్ద వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

మఠంపల్లి : మండలంలోని చెన్నాయిపాలెం వద్ద మిషన్ భగీరథ పైపులైను లీకై నాలుగు రోజులుగా నీరు వృథాగా పోతోంది. తాగునీరు పొలాల్లో పారుతున్న ఇప్పటికీ మిషన్ భగీరథ అధికారులు స్పందించకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగడానికి నీరు దొరక్క అల్లాడుతుంటే అధికారులు నీటి వృథాను పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని అంటున్నారు. వెంటనే పైపులైన్ మరమ్మతులు చేపట్టి నీటిని వృథా కాకుండా చూడాలని కోరుతున్నారు.

శ్రీకాంత్ కుటుంబానికి అండగా ఉంటాం



నాగమణికి ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోదాడరూరల్ : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిమిర్యాలకు చెందిన జిల్లా శ్రీకాంత్ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. ప్రమాదంలో మృతి చెందిన శ్రీకాంత్, కుమార్తె లాస్య చిత్రపటాలకు గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతుని భార్య నాగమణికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, ఇర్ల సీతారాంరెడ్డి, రేవూరి వెంకటాచారి, అమరనాయిని వెంకటేశ్వరరావు, పూర్ణ, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

చిన్నారికి నివాళి

సూర్యాపేట : మండల పరిధిలోని పిన్నాయిపాలెం గ్రామంలో ఏడేళ్ల చిన్నారి మణికంఠ బుధవారం ఈత కొట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందాడు. గురువారం మణికంఠ మృతదేహాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే లింగయ్య పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న రుక్మారావు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెంలో బస్టాండ్ వద్ద యశోద ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం బాటసారులకు, ద్విచక్ర వాహనదారులకు మజ్జిగ పంపిణీ చేసినట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.నరాల రుక్మారావు తెలిపారు. గ్రామానికి చెందిన చల్లా గుర్వయ్య సహకారంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మోతె : మండల కేంద్రంలో గురువారం జరిగిన కాంగ్రెస్ ఎన్నికల ప్రచార సభలో సర్వారం గ్రామానికి చెందిన 150 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో పార్టీలో చేరారు. వారికి సంతోష్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ మిక్కిలినేని ఇందిర పురుషోత్తమరావు, ఉప సర్పంచ్ సైదమ్మ శ్రీనివాస్, ఎంపీటీసీ మేకల ఉపేంద్ర శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు మేకల గురుకృష్ణ, హలావతు బాలాజీ, ఏలూరి నాగమణికోటేశ్వరరావు, ఏలూరి వరలక్ష్మీవెంకటేశ్వరరావు, వార్డు సభ్యులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నోముల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హేమామాలిని

నడిగూడెం : ప్రస్తుతం ఎండలు తీవ్రంగా ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ హేమామాలిని కోరారు. గురువారం నడిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని చెప్పారు. గ్రామాల్లో ఎండకు ప్రజలు బయటకు రాకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, ఏఎస్‌ఐ జగన్, ఆర్‌ఐ గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయిస్తా

- రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నడిగూడెం : మండలంలోని అన్ని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయిస్తానని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం నడిగూడెం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. మండలంలో చివరి భూముల వరకు సాగు నీరందిస్తానని అన్నారు. గత ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలను విస్మరించిందని ఆరోపించారు. ఎన్నికల అనంతరం ప్రతి నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. అలాగే నడిగూడెం మండల కేంద్రంలో వరద నీటితో ముంపుకు గురవుతున్న ఎస్సీ కాలనీలో ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. ఈ నెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, స్థానిక జెడ్పీటీసీ బాణాల కవిత, వైస్ ఎంపీపీ బడేటి వెంకటేశ్వర్లు, పీసీసీ కార్యదర్శి లక్ష్మీనారాయణరెడ్డి, నడిగూడెం ఎంపీటీసీ సభ్యుడు గుండు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, కార్యదర్శి వేపూరి సుధీర్, నాయకులు దున్నా శ్రీను, పగడాల ప్రభాకర్‌రెడ్డి, దేవబత్తిని రమేష్ ప్రసాద్, గడ్డం మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు మాదిగల సంపూర్ణ మద్దతు



మాట్లాడుతున్న చింతా బాబుమాదిగ

హుజూర్‌నగర్ : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చింతా బాబుమాదిగ తెలిపారు. గురువారం హుజూర్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు రెడపంగు రాము అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ఎస్సీ వర్గీకరణ పేరుతో కపట కమిటీలతో కాలయాపన చేసి మాదిగలకు అన్యాయం చేయాలని చూస్తుందని ఆరోపించారు. మాదిగలంతా ఏకమై దళితుల వ్యతిరేక పార్టీ బీజేపీని గద్దె దించాలని అన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ నాయకులు కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ రెడ్డి గెలుపులో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పల్లెటి లక్ష్మణ్ మాదిగ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.కాటమయ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కంటి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి విజయ భాస్కర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జానయ్య, నాయకులు ఆర్.మహేష్, కె.రవి, ఆర్.నాగరాజు, కె.సుధాకర్, బాబు, జీవరత్నం, శ్రీకాంత్, లోకేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు



బొజ్జగూడెం గ్రామస్తులతో మాట్లాడుతున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి

అనంతగిరి : పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించవద్దని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి అన్నారు. గురువారం అనంతగిరి మండలంలోని బొజ్జగూడెంతండాలో సుమారు 30 మంది పోలీసు సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి అవాచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్డన్ సెర్చ్‌లో 11 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి

కోదాడరూరల్ : పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు ఖాయమైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అల్వాలపురం, దోరకుంట, చిమిర్యాల, మంగళితండాలో ఎంపీ ఎన్నికలపై నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోదాడలో ప్రశాంతమైన రాజకీయం నడుస్తుందని, ప్రజలు ఎవరి పనులు వారు చేసుకుంటున్నారని అన్నారు. కోదాడ నుంచి లక్ష మెజార్టీ ఇచ్చేవిధంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారిశేషు, ఇర్ల సీతారాంరెడ్డి, రేవూరి వెంకటాచారి, అమరనాయిని వెంకటేశ్వరరావు, సులోచనరావు, పులి రాజారావు, కొత్త గుర్వయ్య, వీరునాయక్ తదితరులు ఉన్నారు.

మట్టపల్లిలో వైభవంగా నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని గురువారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్స సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు నిర్వహించారు. అదేవిధంగా శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రవేశం గావించి నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి క్రిష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా గుంతలు తవ్వి మట్టి తరలింపు



చిలుకూరులోని చెరువులో గుంతలు తవ్వి మట్టిని తరలిస్తున్న రైతులు

చిలుకూరు : మండల కేంద్రంలోని చెరువులో పలువురు ఇష్టానుసారంగా గుంతలు తవ్వి మట్టిని తరలిస్తున్నారు. చెరువులో ఎక్కడ పడితే అక్కడ జేసీబీలతో పెద్దఎత్తున గుంతలు తవ్వుతున్నారు. చెరువులో నిబంధనలకు విరుద్ధంగా గుంతలు తవ్వడంపై గ్రామానికి చెందిన పలువురు కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ధ్రువకుమార్, ఇరిగేషన్ ఏఈ మానసకు గురువారం ఫిర్యాదు చేశారు. ఇరిగేషన్ సిబ్బంది దగ్గర ఉండి నిబంధనల ప్రకారం చెరువు మట్టిని తవ్విస్తే చెరువు నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, అధికారులు చెరువును పరిశీలించి గుంతలు ఏర్పడకుండా మట్టిని తోలుకునేలా చూడాలని కోరారు. రైతులకు మాత్రమే మట్టిని తోలుకునే అనుమతి కల్పించాలని కోరారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ నవ్య

చిలుకూరు : ఈ నెల 13వ తేదీన జరగబోయే పార్లమెంటు ఎన్నికల్లో వైద్య సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలని డాక్టర్ నవ్య అన్నారు. గురువారం చిలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్నికల విధులపై వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎండలు తీవ్రంగా ఉంటాయని కావున పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని సూచించారు. ఓటర్లకు వైద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వినోద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎమ్‌లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.